
# నారా వారి 'నక్క'జిత్తులు



**గుంటూరు ఈస్ట్/వెస్ట్ :** సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎన్డీయే నాయకులు చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ తమ ప్రసంగాల్లో సూపర్ సిక్స్ పథకాల గురించి ఊదరగొట్టారు. అధికారంలోకి వస్తే వెంటనే అమలు చేస్తామని చెప్పారు. గ్రామాల్లో సైతం చిన్న నాయకులు కూడా పథకాలకు సంబంధించిన సమాచారంతో ప్రచారం చేశారు. 'తల్లికి వందనం' కింద ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి సంవత్సరానికి రూ.15 వేలు, 'అన్నదాత సుఖీభవ' కింద ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు, యువతకు 20 లక్షల ఉద్యోగాలు లేదంటే ఉద్యోగం వచ్చే వరకు 'నిరుద్యోగ భృతి' కింద నెలకు రూ.3 వేలు, ప్రతి ఇంటికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 19–59 ఏళ్ల మహిళకు ప్రతి నెలా రూ.1,500 చొప్పున ఇస్తామని చెప్పారు. ఆయా పథకాల ద్వారా ఇంత వస్తుంది ... అంత వస్తుందని ఊదరగొట్టారు. ఇంతగా ఆశ పెట్టి వారి చేత ఓట్లు వేయించుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులు దాటినా వాటి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. పాఠశాలలు మొదలైనా ఇప్పటివరకు తల్లికి వందనం ఊసే లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా రైతులకు పెట్టుబడి సాయం కింద పైసా రాలేదు. దీంతో వారు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. గత ఐదేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చెప్పినట్లుగా పక్కాగా పథకాలన్నీ అమలు చేసింది. ఆ సమయానికి లబ్ధిదారుల ఖాతాల్లో మొత్తం జమ అయ్యేలా చూసింది. కూటమి అధికారంలోకి వచ్చాక కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు ఇప్పట్లో వాటిని అమలు చేయలేమనే వ్యాఖ్యలు చేస్తుండటంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతంలో మాదిరిగా అధికారం కోసమే ఇచ్చే ఉత్తుత్తి హామీల జాబితాలో వీటిని చేర్చుతారా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఇప్పటికైనా హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## సూపర్ సిక్స్ హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ప్రజల డిమాండ్



ప్రతి మహిళకు నెలకు
రూ.1,500

నియోజకవర్గాలవారీగా లబ్ధిదారులు

| | |
|---|---|
| గుంటూరు (ఈస్ట్ /వెస్ట్) | 2.41 లక్షలు |
| నెలకు ఇవ్వాల్సిన సాయం | రూ.36.15 కోట్లు |

### జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందిన సాయం

| పథకం | నియోజకవర్గం | లబ్ధి (రూ.కోట్లలో) |
|---|---|---|
| అమ్మ ఒడి | ఈస్ట్/వెస్ట్ | 99,162 మంది |
| అందిన సాయం | | 172.36 కోట్లు |




### టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందాల్సిన సాయం

నియోజకవర్గాలవారీగా లబ్ధిదారులు

| | |
|---|---|
| గుంటూరు (ఈస్ట్ /వెస్ట్) | 1.30 లక్షలు |
| ఇవ్వాల్సిన సాయం | రూ.195కోట్లు |

### జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందిన సాయం

| పథకం | నియోజకవర్గం | లబ్ధి (రూ.కోట్లలో) |
|---|---|---|
| రైతు భరోసా | ఈస్ట్/వెస్ట్ | 25 వేల మంది |
| అందిన సాయం | | 110 కోట్లు |



### టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందాల్సిన సాయం

నియోజకవర్గాలవారీగా లబ్ధిదారులు

| | |
|---|---|
| గుంటూరు (ఈస్ట్ /వెస్ట్) | 6,250 మంది |
| ఇవ్వాల్సిన సాయం | రూ.12.50 కోట్లు |



యువతకు నెలకు
రూ.3 వేల నిరుద్యోగ భృతి

నియోజకవర్గాలవారీగా లబ్ధిదారులు

గుంటూరు (ఈస్ట్ /వెస్ట్) 2 లక్షల మంది

నెలకు ఇవ్వాల్సిన సాయం రూ.60 కోట్లు

### భృత్తిపై స్పష్టమైన ప్రకటన ఇవ్వాలి



నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారనే విషయాన్ని స్పష్టంగా ప్రకటించాలి. డిగ్రీ విద్యార్హతతో గ్రూప్–2తో పాటు వివిధ ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నాను. కోచింగ్‌కు వేలాది రూపాయలు ఫీజులు కట్టాల్సి రావడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తామని ఇచ్చిన హామీతో నాతో పాటు ఎంతో మంది దీని కోసం ఎదురు చూస్తున్నారు. తక్షణమే దీనిపై నిర్ణయం ప్రకటించాలి.

–రవితేజ, నిరుద్యోగి

### తల్లికి వందనం ఎప్పుడిస్తారు ?



ఎన్నికల హామీలో చెప్పిన విధంగా తల్లికి వందనం కింద డబ్బులు ఎప్పుడు ఇస్తారు. మా అబ్బాయి ఖాసిం ఆరో తరగతి చదువుతున్నాడు. గత ప్రభుత్వంలో వైఎస్. జగన్ నాలుగేళ్లపాటు క్రమం తప్పకుండా జగనన్న అమ్మఒడి ద్వారా ఏడాదికి రూ.15వేలు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం గత జూన్ నెలలో ఇవ్వాల్సిన అమ్మఒడి డబ్బులు ఇవ్వకుండా అడ్డుకుంది. అదే జగనన్న ప్రభుత్వమే ఉంటే జూన్ నెలాఖరులో ఎవ్వరినీ అడగాల్సిన అవసరం లేకుండా బ్యాంకు ఖాతాలో జమ చేసేవారు.

– షేక్ కరీమూన్, విద్యార్థి తల్లి, గుంటూరు

### మాట తప్పితే ఎలా ?



సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌లు ఎన్నికల సమయంలో అలివిగాని హామీలు ఇచ్చారు. ప్రజలను మోసం చేస్తారని భావించాం. అనుకున్నట్లుగానే ఇప్పుడు జరుగుతోంది. కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయకపోవడం సిగ్గుచేటు. ఇకనైనా ప్రధాన హామీలు వెంటనే అమలు చేయాలి. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం వేస్తామన్నారు. ఇప్పుడు కాలయాపన చేయడం సబబు కాదు. సూపర్ సిక్స్ పథకాల అమలు కోసం ప్రజలంతా ఎదురుచూస్తున్నారు.

– మెట్టు శివనాగిరెడ్డి , గుజ్జనగుండ్ల

### ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం రావాలి



నాకు ఇద్దరు పిల్లలు. ఒకరు ఇంటర్, ఒకరు 8వ తరగతి చదువుతున్నారు. సూపర్ సిక్స్ పథకం కింద తల్లికి వందన ద్వారా నగదు జమ చేస్తామని ఎన్నికల సమయంలో చెప్పారు. ఇంత వరకు జమ కాలేదు. ప్రభుత్వం చెప్పిన విధంగా నా ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం కింద నగదు తక్షణం జమ చేస్తే చదువులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. గతంలో విద్యా సంవత్సరం ప్రారంభంలోనే వేసేవారు. దీనిపై ఇంత వరకు ప్రభుత్వం నుంచి ప్రకటన రాకపోవడంతో ఆందోళన చెందుతున్నాం.

– నందిని, గుంటూరు

### భృతి ఎప్పుడిస్తారు ?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇంటికో ఉద్యోగం లేదా నెలకు రూ.మూడు వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలకు, పోటీ పరీక్షలకు ఏళ్ల తరబడి సన్నద్ధమవుతున్న నిరుద్యోగ యువత ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోచింగ్‌కు వేలాది రూపాయలు ఫీజులు చెల్లిస్తున్న నిరుద్యోగులు భృతి కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ఎన్నికల సమయాన ఇచ్చిన హామీల్ని తప్పకుండా అమలు చేయాలి. కమిటీల పేరిట కాలయాపన తగదు

– కె.సుబ్రహ్మణ్యం, నిరుద్యోగి

## క్లుప్తంగా

### జిల్లా కోర్టులో ముగిసిన వినాయక చవితి వేడుకలు

రూ.2.45 లక్షలు పలికిన లడ్డూ



**నగరంపాలెం:** జిల్లా కోర్టు ఆవరణలో వినాయకచవితి వేడుకలు బుధవారంతో ముగిశాయి. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లడ్డూకు వేలం పాట నిర్వహించగా, రూ.2.45 లక్షలకు మాజీ జీపీ పోకల వెంకటేశ్వర్లు పాడుకున్నారు. అన్నదానం నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి. పార్థసారథి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

### 29న మోడల్ టెట్

**గుంటూరు ఎడ్యుకేషన్:** యునైటెడ్ యూత్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29న మోడల్ టెట్ నిర్వహిస్తున్నట్లు సంస్థ గుంటూరు జిల్లా అధ్యక్షుడు పిన్నింటి బాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరులోని ఏసీ కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు టెట్ పేపర్–1, పేపర్–2 జరగనున్న పరీక్షలకు హాజరుకాగోరు అభ్యర్థులు 96036 69032 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.ఈనెల 27లోపు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

### విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

**లక్ష్మీపురం:** విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు జి.పూర్ణచంద్రరావు, సంఘ నాయకుడు వెంకటేశ్వరరావు అన్నారు. గౌరవ అధ్యక్షులు ఎస్.వి నరసింహారావు సంస్మరణ సందర్భంగా బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో విశ్రాంత ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సంఘ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు పూర్ణచంద్రరావు ప్రారంభించారు. శిబిరంలో డాక్టర్ ఎ.ఎ.వి. రామలింగారెడ్డి, డాక్టర్ ప్రత్యూష కొండా, డాక్టర్ మోహన్ పాల్గొన్నారు.

### పెరిగిన మనిషి సగటు వయసు

**నగరంపాలెం:** ప్రపంచవ్యాప్తంగా మనిషి సగటు వయసు బాగా పెరిగిందని విశ్రాంత ఉపాధ్యాయుడు ఏ.వి. రామారావు అన్నారు. తొంభై ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆయనకు అవగాహన యోగా కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీ కాలనీ వైఎస్సార్ పార్క్‌లో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ వయసు పెరిగాక వ్యక్తిగత ఆరోగ్యానికి నడక, వ్యాయామం, ప్రాణాయామాలు, ధ్యానానికి ప్రాధాన్యత ఇవ్వాలని, తద్వారా వైద్య అవసరాలు తగ్గుతాయని సూచించారు. సభకు యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్ అధ్యక్షత వహించారు.

# 'స్వచ్ఛత' ప్రతి ఒక్కరి బాధ్యత

కమిషనర్ పులి శ్రీనివాసులు



నగరపాలక సంస్థ కార్యాలయంలో సంతకం చేస్తున్న కమిషనర్

**నెహ్రూనగర్:** నగరపాలక సంస్థ పరిధిలో స్వచ్ఛత పాటించడం ప్రతి ఒక్కరి జీవన విధానం కావాలని, స్వచ్ఛత హి సేవలో నగర పౌరులు విరివిగా పాల్గొనాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఐటీసీ ఎంఎస్‌కే ఫినిష్ సొసైటీ ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్‌ను, సిగ్నేచర్ క్యాంపెయిన్‌ని కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ గుంటూరు కోసం నగర ప్రజలు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో స్వచ్ఛత హి సేవ కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా రెండు రోజైన బుధవారం ప్రభుత్వ కార్యాలయాలు, వార్డ్ సచివాలయాలు, దేవాలయాలు, పార్క్‌ల పరిసరాల పరిశుభ్రం, ప్రజారోగ్య కార్మికులకు ప్రథమ చికిత్సపై అవగాహన శిబిరాలను నిర్వహించామని తెలిపారు. నగరంలో వర్షం నీరు ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయడంతో పాటు యాంటీ లార్వా స్ప్రే చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, డిప్యూటీ కమిషనర్లు సీహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఎంహెచ్‌ఓలు మధుసూదన్, రామారావు, మేనేజర్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

**ఆక్రమణల తొలగింపు**

ప్రజా ప్రయోజనాల దృష్ట్యా నగరపాలక సంస్థ పరిధిలో డ్రెయిన్లు, రోడ్లపై మీద ఆక్రమణలను తక్షణం తొలగిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం లాలాపేట, పట్నం బజార్ లోని పలు ప్రాంతాల్లో ఆక్రమణలను డీసీపీ శ్రీనివాసరావు, ఏసీపీ అజయ్ కుమార్, టీపీఎస్ సువర్ణ కుమార్‌లు అక్రమ ఆక్రమణ దళంతో తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో డ్రెయిన్లపై ఆక్రమణల వల్ల వ్యర్థాలు అడ్డుపడి వర్షం నీరు రోడ్ల మీదకు, ఇళ్లల్లోకి వెళ్లి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వార్డు సచివాలయాల వారీగా పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో గుర్తించి, వాటి తొలగింపుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

**విస్తరణ పనులు వేగవంతం చేయాలి**

రెడ్డిపాలెం రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని, మూడు రోజుల్లో డ్రాఫ్ట్ నివేదిక ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టం చేశారు. ఆయన బుధవారం విస్తరణ పనుల్ని అధికారులతో కలసి పరిశీలించారు. అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. రెడ్డిపాలెం మెయిన్ రోడ్డులో చెత్త కుప్పలను తొలగించాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. అనంతరం నగరపాలక సంస్థ వెహికిల్ షెడ్‌ని తనిఖీ చేశారు. పది రోజుల్లో అన్ని వాహనాల్ని వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. ఆయన వెంట ఎస్ఈ. శ్యాం సుందర్, ఈఈ కొండారెడ్డి, డీఈఈ సతీష్, టీపీఎస్ సువర్ణ కుమార్, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

**పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి**

నగరంలో పన్ను వసూళ్ల వేగవంతం చేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. తన చాంబర్‌లో అదనపు కమిషనర్‌తో కలసి డెప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లతో రెవెన్యూ విభాగ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పన్ను వసూళ్లలో పురోగతి ఉండాలని ఆదేశించారు. ప్రైవేట్, ప్రభుత్వ ఖాళీ స్థలాల పన్నులు, నీటి చార్జీలు, నగరపాలక సంస్థ షాప్‌ల అద్దెలు, వసూలు, రెవెన్యూ వల్స్ అంశాల వారీగా నివేదికలు అందించాలని సూచించారు. మొండి బకాయిదార్ల వివరాలను ప్రకటనల రూపంలో ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేస్తామని వారికి నోటీసుల ద్వారా తెలియజేయాలని చెప్పారు. అప్పటికీ స్పందించని పక్షంలో కుళాయి, విద్యుత్ సరఫరా నిలుపుదలకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, డెప్యూటీ కమిషనర్లు టి.వెంకట కృష్ణయ్య, సీహెచ్.శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు బాలాజీ బాషా, రెహమాన్, సూపరింటెండెంట్ వెంకట రామయ్య పాల్గొన్నారు.

# విధులు బహిష్కరించిన కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు

నగరంలో ప్రదర్శన



ర్యాలీలో పాల్గొన్న నర్సింగ్ సిబ్బంది

**గుంటూరు మెడికల్:** గుంటూరు జీజీహెచ్ కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు బుధవారం గుంటూరు నగరంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. జీజీహెచ్ ప్రాంగణం నుంచి నినాదాలు చేసుకుంటూ నాజ్ సెంటర్, ఉమెన్స్ కాలేజ్, ఏసీ కాలేజ్ మీదుగా జీజీహెచ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట విధులు బహిష్కరించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర నాయకులు పి.మనీష, స్వచ్ఛంద ప్రసాద్, జిల్లా అధ్యక్షురాలు రేణుక, సెక్రటరీ శివమ్మ, కోశాధికారి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు కోటేశ్వరి, సౌజన్య, కరుణ, జాయింట్ సెక్రటరీలు హైమావతి, సంధ్యా, మేరీ, రమాదేవి, సభ్యులు కుసుమ కుమారి, సుధారాణి, బాలసుందరి, అంజమ్మ, సురేష్, సర్దార్, సుభాని పాల్గొన్నారు.

**ఎమ్మెల్సీ లక్ష్మణరావుకు వినతి**

తమ సమస్యలను పరిష్కరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సెస్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ స్వచ్ఛందప్రసాద్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుంచి కాంట్రాక్టు విధానంలో ఉన్న నర్సులను కాదని, 18 నెలలు నామమాత్రపు శిక్షణను ఇచ్చి సర్వీస్ ఏఎన్ఎంలకు స్టాఫ్ నర్సుల పోస్టింగ్ ఇచ్చే విధంగా ఉన్న జీవో నంబర్ 115 ని రద్దు చేయాలని కోరారు.

# దేశ సమగ్రతకు ప్రతీక ఎన్‌సీసీ



దినేష్‌ను అభినందిస్తున్న బ్రహ్మం, మనోహర్

**గుంటూరు ఎడ్యుకేషన్:** దేశ సమగ్రతకు ప్రతీక ఎన్‌సీసీ అని టీజేపీఎస్ కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం తెలిపారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈనెల రెండో తేదీ నుంచి 13వరకు న్యూఢిల్లీలో నిర్వహించిన తల్ సైనిక్ క్యాంప్‌లో భాగంగా అఖిల భారతస్థాయి ఫైరింగ్ పోటీల్లో బీఎస్సీ తృతీయ సంవత్సర విద్యార్థి గుంటుపల్లి వెంకట దినేష్ ఐదో స్థానంలో నిలిచినట్లు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ మాట్లాడుతూ ఏటా తమ కళాశాల నుంచి విద్యార్థులు తల్ సైనిక్ క్యాంపుకు ఎంపికవుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షుడు పోలిశెట్టి శ్యాంసుందర్, కమిటీ సభ్యులు పోలిశెట్టి నాగ సుందరం, ఎన్‌సీసీ అధికారి మేజర్ పి.కుమార్ రాజా, అధ్యాపకులు దినేష్‌ను అభినందించారు.

## పర్సు చోరీ

**పట్నంబజారు:** వ్యక్తి జేబులో పర్సు చోరీపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బంధువులను చూసేందుకు లాలాపేటకు చెందిన చావలి గోపాలకృష్ణ అక్కడకు బుధవారం వచ్చారు. ఈ సమయంలో జేబులో పర్సు చోరీకి గురైంది. అందులో రూ. 15వేలు ఉన్నట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

**అన్నపై తమ్ముడి దాడి**

అన్నపై తమ్ముడు కొంతమంది వ్యక్తులతో కలిసి దాడిచేసి గాయపరచిన సంఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. శ్రీనివాసరావుపేటలో నివాసం ఉండే దాసరి రవికుమార్ ఆయన భార్యతో కుటుంబ కలహాల నేపథ్యంలో వేరుగా ఉంటున్నాడు. ఐదు రోజుల కిందట రవికుమార్ తమ్ముడు రవికిరణ్ భార్య సావిత్రి వచ్చి ఇక్కడే ఉంటోంది. ఈ క్రమంలో బుధవారం రవికిరణ్ కొంత మంది వ్యక్తులతో కలిసి తన భార్య ఇక్కడ ఎందుకు ఉందంటూ ? అన్న రవికుమార్‌పై దాడిచేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నగరం పాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నాట్కో సెంటర్‌ను సందర్శించిన ఎమ్మెల్యేలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు వెనిగళ్ల రాము, జూలకంటి బ్రహ్మారెడ్డి తదితరులు

**గుంటూరు మెడికల్:** గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను గుడివాడ, మాచర్ల నియోజకవర్గాల శాసనసభ్యులు వెనిగళ్ల రాము, జూలకంటి బ్రహ్మారెడ్డి బుధవారం సందర్శించారు. రోగులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో వెనిగళ్ల రాము మాట్లాడుతూ ఏపీలో పెద్ద ఆసుపత్రిగా గుంటూరు జీజీహెచ్‌కు పేరుందన్నారు. ఇదే మాదిరిగా గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేయడానికి గుంటూరు జీజీహెచ్‌ను సందర్శించినట్లు వెల్లడించారు. నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో వైద్య సేవలు బాగున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్ ఆసుపత్రి సిబ్బందికి అభినందనలు తెలిపారు. రోగులకు కావాల్సిన అన్నిరకాల సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. గతంలో హైదరాబాద్, మద్రాస్ లాంటి రాష్ట్రాలు వెళ్లాల్సి వచ్చేదని గుర్తు చేశారు. నాట్కో సెంటర్లో స్టాఫ్ నర్సుల తమ సమస్యలపై ఎమ్మెల్యే వెనిగళ్ల రామును కలసి వినతి పత్రాన్ని సంఘం సభ్యులు సమర్పించారు. ఆరోగ్య శాఖ మంత్రితో మాట్లాడతానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాట్కో సమన్వయకర్త వై.అశోక్ కుమార్ పాల్గొన్నారు.

## భాష్యంలో ఘనంగా గణనాథుని నిమజ్జనం



పూజలు నిర్వహిస్తున్న భాష్యం రామకృష్ణ, సిబ్బంది

**గుంటూరు ఎడ్యుకేషన్:** గణనాథుని ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గత 11 రోజులుగా పూజలందుకున్న గణనాథుని నిమజ్జనాన్ని విద్యార్థుల కేరింతల నడుమ కోలాహలంగా నిర్వహించారు. అనంతరం వేలం పాటలో లడ్డూను రూ.36వేలకు భాష్యం రామకృష్ణ తనయుడు సాకేత్‌రామ్ చేజిక్కుంచుకున్నారు. నిమజ్జనంలో భాగంగా భాష్యం రామకృష్ణ తల్లి పేరమ్మ చేతుల మీదుగా అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

## సృజనాత్మక, నైపుణ్యాలకు పదును పెట్టాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అయ్యప్ప

**గుంటూరు ఎడ్యుకేషన్:** విద్యార్థులు తమలోని సృజనాత్మక, నైపుణ్యాలకు పదును పెట్టాలని కెరీర్ కౌన్సెలింగ్ శిక్షకుడు అయ్యప్ప పేర్కొన్నారు. కొరిటిపాడులోని ఎస్ఆర్ఎంవో హైస్కూల్లో బుధవారం యువజన సర్వీసులశాఖ, స్టెప్–స్వశక్తి ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, కెరీర్ మార్గదర్శకాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అయ్యప్ప మాట్లాడుతూ విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను అభివృద్ధి పరచుకోవాలని సూచించారు. జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకునేందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. స్టెప్ స్వశక్తి మేనేజర్ బి.రాధిక మాట్లాడుతూ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, ఉన్నత విద్య అభ్యసించడం ద్వారా భవిష్యత్తులో వారికి వచ్చే ఉద్యోగావకాశాల గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్. లలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.